క్లుప్తంగా

రాజగోపుర నిర్మాణానికి విరాళం



దాతలకు బాండ్ అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపురం నిర్మాణం కోసం శుక్రవారం ఓ భక్తుడు రూ.1,0,1000 విరాళంగా అందజేశారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రం సింధనూరుకు చెందిన లక్ష్మినరసింహ కుటుంబ సభ్యులు రూ.1,0,1000 దేవాలయ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలు, బాండు అందజేశారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

కోసిగి: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతోందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెట్టన గౌడ అన్నారు. శుక్రవారం మండలంలోని కందుకూరు గ్రామంలో ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే వై.బాలనాగి రెడ్డి సహకారంతో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విజేతలకు వరుసగా.. రూ.15వేలు, రూ.10వేలు నగదు బహుమతులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ నాయకుడు తాయన్న, ఎంపీటీసీ కురువ మల్లయ్య, సత్యనారాయణ, ఆర్గనైజర్స్ వీరేష్, ఆనంద్, రామాంజి, శేఖర్ పాల్గొన్నారు.

అలరించిన హరిదాస పారాయణం



హరికథ పారాయణం చేస్తున్న విద్వాంసుడు

మంత్రాలయం : చాతుర్మాసాన్ని పురస్కరించుకుని మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య కార్యక్రమాలు చేపట్టింది. ఈ నేపథ్యంలో శుక్రవారం హరిదాస పారాయణం నిర్వహించారు. శ్రీహరి, లక్ష్మిదేవి చరితను హరికథ రూపంలో వినిపించారు. హరికథ ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

వైభవంగా బంగారు పల్లకోత్సవం



పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

మంత్రాలయం: రాఘవేంద్రస్వామి సన్నిధానంలో బంగారు పల్లకోత్సవం వైభవంగా జరిగింది. శుక్రవారం ఉదయం ఊంజల మంటపంలో బృందావన ప్రతిమకు దివిటీ సేవ చేపట్టారు. అనంతరం శ్రీమఠం ప్రాంగణ వీధుల్లో భక్తజన సందోహం మధ్య పల్లకీసేవ జరిపించారు. వేడుకలో జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, ధార్మిక సహాయక అధికారి వ్యాస రాజాచార్, బిందుస్వామి పాల్గొన్నారు.

టీపీఓకు పదోన్నతి



టీపీఓను సన్మానిస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

ఆదోనిటౌన్: మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్న శ్రీనివాసులకు అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా పదోన్నతి లభించింది. దీంతో శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి, ఆర్‌ఓ అస్లాంబాషా, డీఈలు శ్రీనివాసనాయక్, రవి, సిబ్బంది, ఉద్యోగులు ఆయనను ఘనంగా సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. స్థానికంగానే టీపీఓగా పనిచేస్తూ పదోన్నతి పొంది ఇక్కడే పోస్టింగ్ పొందడం హర్షణీయమన్నారు.

జిల్లా రచయితకు 'హంస' పురస్కారం

కర్నూలు కల్చరల్: జిల్లా రచయిత ఎస్‌డీపీ అజీజ్ హంస పురస్కారం–2023కు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు మరియు సంస్కృత అకాడమీ తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరుస్తూ సేవలు అందించిన 11 మందికి ఈ పురస్కారాలు ప్రకటించింది. సాహిత్య విభాగం నుంచి ఎస్‌డీపీ అజీజ్‌ను ఎంపిక చేశారు.



ఈ ఫొటోలో పత్తి పంటను చూపుతున్న రైతు పేరు ఉశేని, సాతనూరు వాసి. ఆయన తనకున్న నాలుగు ఎకరాల్లో గతేడాది పత్తి, మిరప పంటలు సాగు చేశాడు. అయితే ప్రకృతి విపత్తుల కారణంగా పంటలు నష్టపోయాడు. దీంతో ప్రభుత్వం రూ.32,500 బీమా కింద పరిహారం అందజేసింది. ఇందుకు సాగు చేసిన పంటల వివరాలను నాడు..ఈ–క్రాప్‌లో నమోదు చేయించాడు. ఈయనతో పాటు పంటలు కోల్పోయిన కొందరు రైతులకు పరిహారం అందలేదు.. అందుకు కారణం.. వారు సాగు చేసిన పంటల వివరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేయించకపోవడమే. ప్రస్తుతం ఖరీఫ్‌లో భాగంగా ఉల్లి, పత్తి పంటలు సాగు చేశాడు. ఇప్పుడు కూడా తన పంటలను వ్యవసాయ అధికారుల సాయంతో ఈ–క్రాప్‌లో నమోదు చేయించానని చెబుతున్నాడు.



రైతులకు అండగా 'ఈ-క్రాప్'

- పథకాల వర్తింపునకు పంట నమోదే ఆధారం
- ఉచిత పంటల బీమా, సబ్సిడీ పథకాలకు పంట వివరాల సేకరణ
- ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 45 వేల హెక్టార్లలో పంటల సాగు
- వచ్చే నెల 15వ తేదీ వరకు అవకాశం

కోసిగి: ఆరుగాలం శ్రమించి పండించిన పంట అతివృష్టి, అనావృష్టి, తెగుళ్ల బారిన పడి నష్టపోతే రైతన్న కుదేలవుతాడు. నాలుగేళ్ల క్రితం వరకు అన్నదాతను కష్టకాలంలో ఆదుకున్న దాఖలాలు లేవు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత రైతు ప్రభుత్వంగా ప్రకటించారు. వ్యవసాయంలో కర్షకులకు అడుగడుగునా అండగా నిలిచేందుకు వివిధ పథకాలను అమలు చేస్తున్నారు. అయితే వీటన్నింటికీ మూలం..ఈ–క్రాప్ నమోదు. సాగు చేసిన పంటను ఈ–పంటలో నమోదు చేయిస్తే.. ప్రభుత్వం అందజేసే వ్యవసాయ సంక్షేమ పథకాలు, సబ్సిడీలు, ఎరువులు, పురుగు మందులు, పంటల బీమా తదితర వాటిని వర్తింపజేస్తుంది. ముఖ్యంగా పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందజేయడానికి ఈ -క్రాప్ నమోదును ప్రామాణికంగా తీసుకుంటోంది. సాగు చేసిన పంటలను నమోదు చేయడం తప్పనిసరి చేసింది.

ఆర్బీకేల ఆధ్వర్యంలో..

విపత్తు సంభవించినప్పుడు నష్టపోయిన రైతులకు పరిహారం అందించేందుకు ఉచితంగా పంటల బీమాను ప్రభుత్వం అమలు చేస్తోంది. పరిహారం అందాలంటే సాగు చేసిన పంట విస్తీర్ణం, రకం, సర్వే నంబర్, రైతు, తదితర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. వీటిని స్థానిక ఆర్బీకేల్లోని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి ఈ–క్రాప్ బుకింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం పంటల నమోదు జోరుగా సాగుతోంది.

పంటల సాగు విస్తీర్ణం..

మంత్రాలయం నియోజకవర్గంలోని కోసిగి, కౌతాళం, మంత్రాలయం, పెద్దకడబూరు మండలాల్లో సాధారణ సాగు విస్తీర్ణం 71,996 హెక్టార్లు. ఇందులో ఏటా అత్యధికంగా 34,800 హెక్టార్లలో పత్తి, 12వేల హెక్టార్లలో వేరుశనగ, మిగిలిన ఎకరాల్లో మిరప, ఉల్లి, వరి, ఆముదం, కంది తదితర పంటలు సాగుచేస్తారు. కాగా.. ఈ ఏడాది పంటల సాగు విస్తీర్ణం కొంతమేర తగ్గింది. ఇందుకు ప్రధాన కారణం వర్షాలు సరైన సమయంలో కురవకపోవడమే. కోసిగి మండల సాధారణ సాగు విస్తీర్ణం 45వేల ఎకరాలు. ప్రస్తుతం దాదాపు 35 వేల ఎకరాల్లో పంటలు సాగై ఉండొచ్చని అధికారులు పేర్కొంటున్నారు. వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో పంటల సాగు తగ్గిందని వారు చెబుతున్నారు. ప్రస్తుతం సాగైన పంటలను ఈ–క్రాప్ నమోదు ముమ్మరంగా సాగుతోంది. ఆయా మండలాల్లోని గ్రామాల్లో 25 శాతం వరకు నమోదు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. సెప్టెంబర్ నెల 15వ తేదీ వరకు పంటలను నమోదు చేసుకునేందుకు అవకాశముందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

ఉపయోగాలు..

ఖరీఫ్ సీజన్‌లో ప్రతి రైతు పంట పొలాల్లో సాగు చేసిన పంటలను ఈ–క్రాప్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలి. ప్రకృతి వైపరీత్యాల కారణంగా సాగు చేసుకున్న పంటలు చేతికందక పోతే ప్రభుత్వం బీమా వసతితో పాటు నష్ట పరిహారం అమలు చేస్తోంది. పంట రకం ఆధారంగా పరిహారం అందించే అవకాశం ఉంది. తద్వారా గ్రామాల్లో రైతులు నేరుగా దగ్గరుండి తమ సాగుచేసుకున్న పంటలు విలేజ్ అగ్రికల్చర్ సాయంతో నమోదు చేయించాలి. వారు తమ మొబైల్ యాప్‌లో నేరుగా రైతు ఫొటో, పంట రకం ఫొటో తీసి క్రాప్ బుకింగ్ చేస్తారు. ఇందుకు ఆర్బీకేల్లో రైతుల పట్టదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం అందజేయాలి. బీమా, పరిహారంతో పాటు బ్యాంక్‌లో క్రాప్ ఆధారంగా క్రాప్ బ్యాంక్ లోన్ పొందవచ్చు. ఈమేరకు ఆయా గ్రామాల్లో ఆర్బీకేలలో రైతులకు ఈ -క్రాప్‌పై నమోదుపై వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి రైతు తమ పంట రకం సాగు వివరాలను నమోదు చేసుకుని లబ్ధి పొందాలని సూచిస్తున్నారు.

ఈ-క్రాప్ బుకింగ్ చేయిస్తున్నాం



సాగుచేసిన పంటలను వ్యవసాయ అధికారులతో ఈ–క్రాప్ బుకింగ్ చేయిస్తున్నాం. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక పంటలు కోల్పోయిన వారిని ఆదుకునేందుకు చర్యలు చేపట్టడం అభినందనీయం. ఈ–క్రాప్ బుకింగ్ చేసుకున్న ప్రతి రైతుకు గతంలో పంట బీమా నగదు నేరుగా రైతుల ఖతాల్లో జమ చేశారు. ఈ ఏడాది కూడా

– రామాంజనేయులు, రైతు, సాతనూరు

ప్రతి రైతు ఈ-క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలి



ప్రతి రైతు సాగు చేసిన పంటలను ఈ– క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి. ఈ విధానంతో ఆన్‌లైన్‌లో భూముల వివరాలు నమోదు చేయడం వలన రైతులు తాము సాగు చేసుకున్న పంటలపై సలహాలు, సూచనలు పొందవచ్చు. బ్యాంక్‌లో పంట రుణాలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు నష్ట పోతే పరిహారం, బీమా పొందవచ్చు. అలాగే ప్రభుత్వ సబ్సిడీలు, సంక్షేమ పథకాలు పొందవచ్చు. – రాజు, ఏఓ

నేటి నుంచి చింతలాముని ఆరాధనోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో చింతలామునిస్వామి

ఆదోనిరూరల్: మండంలోని మాంత్రికి గ్రామంలోని చింతలాముని స్వామి ఆలయంలో శనివారం శ్రావణశుద్ద దశమి సందర్భంగా ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. శనివారం రాత్రి 9 నుంచి మరుసటి రోజు ఆదివారం ఉదయం 6 గంటల వరకు అఖండ భజనలు ఉంటాయని చెప్పారు. ఆదివారం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు స్వామివారికి పంచామృతాభిషేకం, పూజా కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం గ్రామంలోని యువకులు కాలినడక ద్వారా తెచ్చిన తుంగభద్ర నది జాలాలతో అన్ని దేవాలయాల్లో జలాభిషేకం చేపట్టి, చితంతలామునిస్వామి ఆలయం నుంచి గ్రామ వీధుల్లో ఆంజనేయస్వామి ఆలయం వరకు పల్లకీసేవ, ఊరేగింపు ఉంటుందని చెప్పారు.

ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో పద్మావతి అమ్మవారు

ఆదోనిఅర్బన్ : స్థానిక తిరుమలనగర్‌లో వెలిసిన శ్రీ పద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయంలో వెలిసిన పద్మావతి మాతకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కుంకుమార్చన, మహామంగళహారతి, పంచామృతాభిషేకం తదితర విశేష పూజలు జరిగాయి. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

అక్రమ మద్యం ధ్వంసం



ఆలూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో మద్యం ప్యాకెట్లను ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఆలూరు రూరల్: అక్రమ మద్యంపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస రెడ్డి అన్నారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు.. చిప్పగిరి, హొళగుంద, హాలహర్వి పోలీసు స్టేషన్ల పరిధిలో 16 కేసులలో పట్టుబడిన 116 బాక్సుల కర్ణాటక మద్యం, 5 లీటర్ల నాటు సారాను శుక్రవారం ఆలూరు పోలీసు స్టేషన్ ఆవరణలో ధ్వంసం చేశారు. ధ్వంసం చేసిన మద్యం విలువ రూ.5,80,000 ఉంటుందని చెప్పారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు డాక్టర్ నాయక్, నాగేంద్ర, వరప్రసాద్, శ్రీనివాసులు ఉన్నారు.

జగనన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం



మాట్లాడుతున్న కప్పట్రాళ్ల బొజ్జమ్మ

ఆలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయబోమని ఆస్పరి మండలం మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు కప్పట్రాళ్ల బొజ్జమ్మ, ఆమె భర్త దేవనకొండ మండలం మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు స్పష్టం చేశారు. హొళగుంద మండలం ఎల్లార్తి గ్రామంలో కొలువుదీరిన షేక్షావలి, షాషావలి దర్గాలను వారు శుక్రవారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలూరులోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో టీడీపీ అభివృద్ధికి ఎంతో కష్టపడినా గుర్తింపు దక్కలేదని వాపోయారు. మాజీ సీఎం చంద్రబాబునాయుడు విధి, విధానాలు నచ్చలేదని, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాల వారికి సమన్యాయం చేస్తూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తుండడంతో ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. కప్పట్రాళ్ల వెంకటప్పనాయుడు ఆశయ సాధన కోసం పనిచేయాలనే లక్ష్యంతో ఉన్నామని, తమను నమ్ముకున్న వారికి మేలు జరగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమవుతుందన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పని చేస్తామని స్పష్టం చేశారు.

మద్దమాంబ అమ్మవారి ఊరేగింపు



ఊరేగింపుగా వస్తున్న దృశ్యం

మద్దికెర: స్థానిక మద్దమాంబ దేవాలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం గ్రామానికి 4 కి.మీ దూరంలో నల్లరేగడి పొలాలలో ఉన్న మద్దమ్మ అమ్మవారి పాదాల వద్ద పూజలు నిర్వహించి ఆచారం ప్రకారం యాదవరాజును పూల సంకెళ్లతో బంధించి కలశాలతో నీటిని ఊరేగింపుగా గ్రామ పురవీధుల గుండా మేళతాళాలతో వచ్చి అనంతరం ఆలయంలో అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు.పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

షరాఫ్ బజార్‌లో కారు బీభత్సం



ఘటన స్థలంలో గుమిగూడిన ప్రజలు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని షరాఫ్ బజార్‌లో శుక్రవారం సాయంత్రం ఓ కారు బీభత్సం సృష్టించింది. వేగంగా దూసుకొచ్చిన కారు ఎదురుగా వస్తున్న స్కూటరిస్టుతో పాటు, బంగారు దుకాణం ముందు నిల్చున్న మరో యువకుడిని ఢీకొట్టి, దుకాణాల ముందు నిలిపిఉంచిన బైకులను ఢీ కొట్టింది. వివరాలు.. తిరుమల అనే యువకుడు కారును వేగంగా డ్రైవ్ చేసుకుంటూ షరాఫ్ బజార్ వైపు వస్తుండగా అదుపుతప్పి ఎదురుగా బైక్‌పై వస్తున్న సామేల్ అనే యువకుడిని ఢీ కొట్టడంతో ఎగిరి కారు అద్దంపై పడ్డాడు. కారు దూసుకెళ్లి షాప్ ముందు నిల్చున్న షాదీన్ అనే యువకుడిని ఢీ కొట్టి, అక్కడ నిలిపిఉంచిన బైకులను ఢీకొట్టి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో సామేల్, షాదీన్ ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు ఘటనా చేరుకొని ప్రమాదానికి కారణమైన కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రమాదంపై విచారణ చేపట్టారు.

భూముల వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయండి

కర్నూలు(సెంట్రల్) : ప్రభుత్వ, ఇనాం, దేవదాయ శాఖల భూములతోపాటు ఇతర భూముల వివరాలను పక్కగా ఆన్‌లైనలో అప్‌లోడ్ చేయాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భూముల ఆన్‌లైన్‌పై డివిజన్, మండల స్థాయి అధికారులకు శిక్షణ ఇచ్చారు.ఆమె మాట్లాడుతూ..పంటలు పండించే రైతుల వివరాలను వ్యవసాయ శాఖ తహసీల్దార్ల ద్వారా తెప్పించుకొని వెబ్‌ల్యాండ్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఆ వివరాలతో వెంటనే వ్యవసాయశాఖ ఈకేవైసీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, డీపీఓ నాగరాజునాయుడు, సర్వే ఏడీ విజయసారథి పాల్గొన్నారు.

హంద్రీ-నీవా నీటితో పైర్లకు జీవం



ట్యాంకర్లతో కుంటను నింపి పైర్లకు నీటి తడులు అందిస్తున్న రైతు కురువ కారుమంచప్ప

చిప్పగిరి: హంద్రీ–నీవా కాలువలకు నీటిని అందించడంతో ఖరీఫ్‌లో సాగుచేసిన పైర్లకు జీవం పోసినట్లయ్యింది. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు కంది, పత్తి, మిరప, సజ్జ, వేరుశనగ తదితర పంటలు సాగుచేశారు. విత్తనం వేసింది మొదలు ఎక్కడా సరైన మోతాదులో వర్షం కురవకపోవడంతో పైర్లు వాడుముఖం పట్టాయి. ఈ స్థితిలో ప్రభుత్వం హంద్రీ నీవాకు నీటిని విడుదల చేయడంతో పైర్లకు జీవం పోసినట్లయ్యింది. ఆయకట్టు కింద రైతులు విద్యుత్, డీజిల్ మోటార్లతో పైర్లకు నీటి తడులు అందిస్తుండగా కొందరు ట్యాంకర్లతో నీటిని తరలించి పొలంలోని కుంటల్లో నింపి పైర్లకు నీటి తడులు పెట్టుకుంటున్నారు. ఇప్పటికైనా వర్షాలు కురిస్తే పెట్టుబడి భారం తగ్గుతుందని రైతులు పేర్కొంటున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఆదోనిటౌన్ : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని 36వ వార్డు కౌన్సిలర్ ఫయాజ్‌అహ్మద్ తెలిపారు. శుక్రవారం వార్డు పరిధిలోని ఎన్టీఆర్ కాలనీ, కాజీగడ్డ, బోయగేరి ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలపై కాజీగడ్డలో సమావేశం నిర్వహించారు. ఆయా ప్రాంతాల వాసుల సమక్షంలోనే సమస్యల పరిష్కారానికి మార్గాలపై చర్చించారు. తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని, ఓవర్‌హెడ్ ట్యాంకు ఎప్పుడూ సగం వరకే నిండుతుందని, పూర్తిగా నిండకపోవడం వల్ల సమస్య ఏర్పడుతోందని కాలనీవాసులు కౌన్సిలర్ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యపై ఎమ్మెల్యే, చైర్‌పర్సన్, కమిషనర్‌లతో మాట్లాడి త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. రోడ్లు, వీధుల్లో వీధిలైట్లు వెలగడంలేదని చెప్పగా వెంటనే పనులు చేపడతామని తెలిపారు.

మంత్రాలయంలో సంబరాలు

మంత్రాలయం: టీటీడీ పాలక మండలి సభ్యుడిగా వైఎస్సార్‌సీపీ మంత్రాలయం నేత వై.సీతారామిరెడ్డి ఎంపిక కావడంతో సంబరాలు అంబరాన్నంటాయి. ఎస్ఐ వేణుగోపాల్‌రాజు వై.సీతారామిరెడ్డితో కేక్ కట్ చేయించి పూలమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మంత్రాలయంలోని రాఘవేంద్రసర్కిల్‌లో సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య నేతృత్వంలో బాణసంచా కాల్చి,మిఠాయిలు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు.

కోలుకోలేక నర్సింగ్ విద్యార్థిని మృతి



గీత (ఫైల్)

హొళగుంద: మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో ఈ నెల 17న ఆత్మహత్యకు ప్రయత్నించిన నర్సింగ్ విద్యార్థిని మాల గీత (20) శుక్రవారం కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. సదరు విద్యార్థిని నర్సింగ్ మొదటి సంవత్సరంలో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెంది ఈ నెల 17న ఇంట్లో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. తీవ్రంగా గాయపడిన గీతను కుటుంబ సభ్యులు బళ్లారి ఓపీడీలో చేర్పించగా కోలుకోలేక శుక్రవారం మృతి చెందింది. గీత తండ్రి మల్లికార్జున ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రెండు బైక్‌లు అపహరణ

తుగ్గలి: మండల పరిధిలోని పగిడిరాయిలో గురువారం రాత్రి రెండు బైక్‌లు అపహరణకు గురయ్యాయి. గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, రామచంద్ర ఇంటి వద్ద ఉంచిన పల్సర్, హీరో హోండా బైక్‌లను దొంగలు అపహరించుకు వెళ్లారు. ఈ మేరకు బాధితులు శుక్రవారం జొన్నగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హెబ్బటంలో చోరీ

హొళగుంద: హెబ్బటం గ్రామంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనాలకు పాల్పడ్డారు. ఒక ఇంట్లో బంగారం, నగదు ఎత్తుకెళ్లిన దుండగులు మరో ఇంట్లో చోరీకి యత్నించగా ఏమీ దొరక్కపోవడంతో పరారయ్యారు. హెబ్బటం బస్టాండు సమీపంలో నివాసం ఉంటున్న మల్లికార్జున స్వామి కుటుంబ సభ్యులు మిద్దెపై నిద్రిస్తుండగా అర్ధరాత్రి ఇంట్లో చొరబడిన దుండగులు బీరువా తెరిచి తులంన్నర బంగారం కలిగిన జత కమ్మలు, రెండు రింగులతో పాటు రూ.50 వేల నగదును ఎత్తికెళ్లినట్లు బాధితులు శుక్రవారం తెలిపారు. ఆ ఇంటి పక్కనే ఉన్న అతని సోదరుడు చిన్న హంపయ్యస్వామి ఇంట్లో కూడా ప్రవేశించిన దొంగలు బీరువాను పగలగొట్టి చూడగా ఏమీ దొరకక పోవడంతో వెనుదిరిగినట్లు చెప్పారు. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫోరెన్సిక్ సిబ్బందిని రప్పించి ఘటనా స్థలంలో దుండగుల వేలి ముద్రలు సేకరించారు.

సచివాలయ కన్వీనర్లు బాధ్యతాయుతంగా పనిచేయాలి





మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, హాజరైన కన్వీనర్లు

పెద్దకడబూరు : రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు సచివాలయ కన్వీనర్లు బాధ్యతాయుతంగా పని చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మా నమ్మకం నువ్వే జగన్ నినాదంతో జేసీఎస్ నమోదు శిబిరం కార్యక్రమంలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ కన్వీనర్లకు రూ.10లక్షలు, గృహ సారథులకు రూ. 2లక్షల ఉచిత బీమా సౌకర్యం కల్పించారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. సచివాలయ మండల కన్వీనర్ రవిచంద్రారెడ్డి, పెద్దకడబూరు, దొడ్డిమేకల సర్పంచ్‌లు రామాంజినేయులు, చంద్రశేఖర్, ఉప సర్పంచ్ విజయేంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ రఘురాముడు, నాయకులు గజేంద్రరెడ్డి, శివారెడ్డి, జాము మూకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆ పాఠశాలపై చర్యలు తీసుకోండి



సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న ఆర్‌యూఎస్‌ఎఫ్ నాయకులు

ఆదోనిరూరల్ : ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్న కిడ్డీస్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (ఆర్‌యూఎస్‌ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, నాయకుడు వంశీ మాట్లాడుతూ ప్రభుత్వ నియమాలు తుంగలో తొక్కి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నా చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. పుస్తకాలు, యూనిఫాం పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు.

నారా లోకేష్‌పై చర్యలు తీసుకోవాలి



ఎస్ఐ శ్రీనివాసులకు ఫిర్యాదు చేస్తున్న పెద్దిరెడ్డి శ్రీనివాసరెడ్డి

ఆదోనిరూరల్ : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా సోషల్ మీడియా కో–కన్వీనర్ పెద్దిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి ఇస్వీ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శ్రీనివాసులకు ఫిర్యాదు చేశారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నారా లోకేష్ రెండు రోజులక్రితం రెచ్చగొట్టే వాఖ్యలు చేశారన్నారు. 2019 నుంచి ఇప్పటివరకు ఏ కార్యకర్తపై ఎక్కువ కేసులు ఉంటాయో వారికి నామినేటెడ్ పదవులు ఇస్తామని చెప్పడం రెచ్చగొట్టే తమ కార్యకర్తల్ని రాష్ట్రంలో అల్లర్లు, గొడవలు సృష్టించేలా ప్రేరేపిస్తున్నారని, అందులో భాగంగా తమ్మలపల్లి, పుంగనూరు, మాచర్ల లాంటి ప్రశాంతమైన నియోజకవర్గాల్లో గొడవలు చోటుచేసుకున్నాయన్నారు. వెంటనే ఆయనపై చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రశాంతంగా వాహనాల వేలం



ఆలూరు పోలీసు స్టేషన్ ఆవరణంలో వాహనాలు వేలం వేస్తున్న పోలీసులు

ఆలూరు రూరల్: ఆలూరు, హాలహర్వి, ఆస్పరి పోలీసు స్టేషన్ల పరిధిలో అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడిన 53 వాహనాలను స్థానిక ఆలూరు పోలీసు స్టేషన్ ఆవరణలో శుక్రవారం వేలం వేశారు. వేలం పాటను ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసుల రెడ్డి సమక్షంలో నిర్వహించారు. పట్టుబడిన 53 వాహనాలకు వేలం పాటలో రూ.12,72,136 ఆదాయం వచ్చిందన్నారు. ఈ నగదును ప్రభుత్వ ఖాజానాకు జమ చేస్తామన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ.. అక్రమ మద్యం రవాణాపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఆలూరు సర్కిల్ పరిధిలోని క్షేత్రగుడి, మార్లమడికి కర్ణాటక సరిహద్దు గ్రామాల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేమన్నారు. అక్రమ మద్యం తరలిస్తే కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామని చెప్పారు. ఎస్ఐలు డాక్టర్ నాయక్, వరప్రసాద్, నాగేంద్ర, శ్రీనివాసులు ఉన్నారు.

కబడ్డీ విజేతలు పెద్దహరివాణం, అమకతాడు జట్లు



విజేతగా నిలిచిన పెద్దహరివాణం బాలుర జట్టు

కర్నూలు (టౌన్) : జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో బాల, బాలికల విభాగాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్దహరివాణం (బాలురు), అమకతాడు (బాలికలు) జట్లు విజేతలుగా నిలిచాయి. జాతీయ క్రీడాదినోత్సవం పురస్కరించుకొని రెండు రోజులుగా స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. రెండో రోజు శుక్రవారం ఫైనల్స్ జరిగాయి. ఇందులో బాలుర విభాగంలో పెద్ద హరివాణం జట్టు 19–12 పాయింట్ల తేడాతో గుండ్లకొండ జట్టుపై గెలుపొందింది. అలాగే బాలికల విభాగంలో అమకతాడు జట్టు 14–7 పాయింట్ల తేడాతో పల్లెపాడు జట్టుపై గెలిచింది. గెలుపొందిన జట్లను జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు అభినందించారు.